క్లుప్తంగా

ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరి కోసం పని చేస్తున్నారు?

ధన్వాడ: యాసంగి ధాన్యం నింపేందుకు గన్నీ బ్యాగులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతుల బాధలు జిల్లా ఎమ్మెల్యేలకు పట్టడం లేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గన్నీ బ్యాగుల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. పైగా మిల్లుల్లో మిల్లర్లు ధాన్యం దించుకుంటాలేమని చెప్పినా వీరు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. మరి జిల్లాలో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరి కోసం పని చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలు, రైతులు గుర్తుకొస్తారని, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం వీరికి గుర్తుకు రావడం లేదన్నారు. తక్షణమే రైతులు ఎదుర్కొంటున్న గన్నీ బ్యాగుల సమస్యను పరిష్కరించి, మిల్లర్లు ధాన్యం దించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కామ్రేడ్ లక్ష్మణ్‌కు ఘన నివాళి



మద్దూరు: కరోనా కాలంలో మృతి చెందిన సీపీఎం మండల కార్యదర్శి కామ్రేడ్ లక్ష్మణ్ 4 వ వర్ధంతిని మండల కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలపై చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు.ఆయన ఆశయ సాధన కోసం మనమందరం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు మహమ్మద్ అలీ, హన్మంతు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

నారాయణపేట రూరల్: దేశ వ్యాప్తంగా జన కులగణన చేపట్టాలని ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని నారాయణపేట జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ కుల గణన చేపట్టలేక పోయిందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీసుకున్న ఈ నిర్ణయం 140 కోట్ల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కులగణన చేపట్టడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, రిజర్వేషన్లు అందించి కులాల వారీగా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్



మాగనూర్(మక్తల్): లయన్స్ క్లబ్ సేవా భవనంలో పాలమూరు కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి సౌజన్యంతో విజన్ చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డీవీ చారి తెలిపారు. సోమవారం శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 40 మందికి కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అంజన్ ప్రసాద్, మామిళ్ల పృథ్వీరాజ్, కంటి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవారం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక తెలంగాణ చౌరస్తాలోని బ్రహ్మంగారి ఆలయంలో మూడు రోజులపాటు ఆరాధన, గురుపూజ మహోత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం స్వామి వారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, కలశ స్థాపన, పుణ్యాహవాచనం, గణపతిపూజ నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే భజన పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భజన పోటీల్లో ఇబ్రహీంబాద్, గొండ్యాల, గార్లపాడ్, కొండాపూర్, జడ్చర్ల, గురుకుంట, అమిస్తాపూర్, పోమాల్ భజన మండలి బృందాలు పాల్గొన్నాయి. అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గోవిందమాంబ సమేత శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, హోమం, కుంకుమార్చన, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శేఖరాచారి, వి.నారాయణ, ప్రభాకరాచారి, నారాయణ పాల్గొన్నారు.

నాలుగు రోజుల నిరీక్షణకు తెర

- లారీలోకి దొడ్డు వడ్లు తరలింపు
- 4 లారీలు కావాలంటున్న రైతులు
- అధికారులు, నాయకుల జోక్యంతో ధాన్యం తరలింపు



మద్దూరులో లారీల్లోకి ధాన్యం లోడ్ చేస్తున్న కార్మికులు

మద్దూరు: రైతులు పండించిన దొడ్డు వడ్ల తరలింపు నాలుగు రోజుల నిరీక్షణ తర్వాత, ఎట్టకేలకు లారీలు రావడంతో ధాన్యం తరలింపు ప్రక్రియ సోమవారం మద్దూరులో ప్రారంభమైంది. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, పెదిరిపాడ్, పల్లెర్ల, దమగ్నాపూర్, పర్సపూర్, తదితర గ్రామాల రైతులు దొడ్డు రకం వడ్లను ట్రాక్టర్లలో తీసుకొని నేరుగా పెదిరిపాడ్ రూట్‌లో ఉన్న పద్మావతి రైస్ మిల్లుకు, భూనీడ్ రోడ్డులోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర మిల్లుకు తరలించారు. దీంతో మిల్లు యజమానులతో అధికారులు మాట్లాడి కొంత మేరకు ధాన్యం ఈ మిల్లుల్లో దించారు. అయితే ఈ విషయం రైతులకు తెలియడంతో మరింత మంది రైతులు ఈ మిల్లులకు ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించారు. దీంతో ఈ మిల్లుల్లో నిల్వ సామర్థ్యం లేకపోవడంతో రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వరుస కథనాలు రావడంతో నారాయణపేట డీఎం సైదులు, మద్దూరు పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ పద్మావతి రైస్‌మిల్లు దగ్గరకు చేరుకొని ధాన్యంను ఇతర జిల్లాలకు తరలించే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. లారీలు రాకపోవడంతో కాంట్రాక్టర్ నర్సింహులును పిలిపించి వెంటనే 10 లారీలను ఏర్పాటు చేయాలని అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ సూచించారు. దీంతో 5 లారీలు తీసుకొచ్చి పద్మావతి రైస్ మిల్లు దగ్గర 3 లారీలు, శ్రీలక్ష్మీవేం కటేశ్వర రైస్‌మిల్లు దగ్గర 1 లారీని ఏర్పాటు చేశారు. లారీల్లో ధాన్యం లోడింగ్ ప్రక్రియ మొదలు పెట్టారు. మరో మూడు లారీలు వస్తే ఇక్కడ ఉన్న ధాన్యం పూర్తిగా తరలుతుందని, నాలుగు రోజులుగా ట్రాక్టర్లపై ధాన్యం ఉంచి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఇక్కడికి వచ్చిన ధాన్యం తరలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇక నుంచి రైతులు నేరుగా రైస్ మిల్లుల దగ్గరకు ధాన్యం తీసుకురావద్దని సూచించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తీసుకెళ్తే అక్కడే ధాన్యం కొంటామని అధికారులు తేల్చి చెప్పారు.



రైతులతో మాట్లాడుతున్న డీఎం సైదులు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ

రహదారిపై రైతుల రాస్తారోకో



ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో చేస్తున్న రైతులు

- 3రోజులుగా ధాన్యంతో మిల్లుల దగ్గర పడిగాపులు
- ప్రతి గింజ కొనాలని రైతుల ఆందోళన
- నచ్చజెప్పేందుకు తహసీల్దార్ ప్రయత్నం

మాగనూర్: రైతులు పండించిన పంట కొనుగోలు చేయకుండా ఇటు మిల్లర్లు, అటు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. చివరికి ధాన్యం క్వాంటిటీ ముగిసిందనే నేపంతో రైతులను మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తు సోమవారం మండల కేంద్రంలోని వడ్వాట్ క్రాస్‌రోడ్డు దగ్గర ఎన్‌హెచ్-167పై రైతులు ఆందోళన చేపట్టారు. మూడు రోజులుగా కుటుంబాలను వదిలి మిల్లుల దగ్గర ట్రాక్టర్ల రోజుకు రూ.3వేలు కిరాయి కట్టుకుంటు నిరీక్షిస్తున్నారు. ధాన్యం విక్రయాలు చివరి దశకు చేరుకున్న రైతులకు సరిపడిన గన్నీ బ్యాగులు, లారీల సరఫరాలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పేర్కొన్నారు. మండలంలో రైస్ మిల్లులు ఉండగా, అధికారులు ఇతర మండలాలకు ధాన్యం పంపిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రైవేట్ వాహనాలలో రోజుల తరబడి మిల్లుల దగ్గర వేచి ఉన్నట్లు తెలిపారు. కనీసం కిరాయిలు కూడా చెల్లించడానికి వచ్చే డబ్బులు సరిపోయేలా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాగనూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకపోవడంతో ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమీపంలోని వైష్ణవి మిల్లు దగ్గర రైతుల ధాన్యం దింపుకునేలా హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓ అలంకుంట ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు తమ కల్లాల దగ్గర ఉన్న ధాన్యం తరలించవద్దని, స్వయాన అధికారులే కల్లాల దగ్గరకు వచ్చి లారీల ద్వారా జోగుళాంబ గద్వాల్ జిల్లాకు తరలిస్తారని తెలిపారు. రైతులు కాస్త సమయమనం పాటించాలని కోరారు. రైతుల రాస్తారోకో వల్ల గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పనిచేసే చోట వేధిస్తే సమాచారం ఇవ్వండి



ఇటుక బట్టీలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

మాగనూర్: పనిచేసే చోట వేధిస్తే సమాచారం ఇవ్వాలని షి టీమ్ పోలీసులు తెలిపారు. సోమవారం మాగనూర్ నల్లగట్టు మారెమ్మవ్వ ఇటుక బట్టీల వద్ద పనిచేసే కూలీలకు షీటీం పోలీసులు సైబర్ నేరాలు, వెట్టిచాకిరీ, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. పనిచేసే చోట ఎవరైనా వేధిస్తే నారాయణపేట షీటీం పోలీసుల నెంబర్: 87126 70398కు సమాచారం అందించాలన్నారు. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఆధునిక సాంకేతికత పెరుగుదలతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తతోనే సైబర నేరాలు నివారించవచ్చన్నారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలి సూచించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు జ్యోతి, కవిత, పోలీసులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులను సన్మానించిన కలెక్టర్



నారాయణపేట: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల చాంపియన్‌షిప్‌లో బాలమణి 49 కేజీల కేటగిరిలో, శివరంజని 73 కేజీల కేటగిరిలో గోల్డ్‌మెడల్స్ సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో సోమవారం వారిని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సన్మానించి అభినందించారు. ఈ నెల 25 నుంచి చండీఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ శెట్టి వెంకటేశ్, అసోసియేషన్ సెక్రటరీ రవికుమార్, పీడీలు బాలరాజ్, వెంకటేశ్, సాయినాథ్, తదితరులు ఉన్నారు.

దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: పట్టణంలోని అశోక్ నగర్ శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన గౌరవ అధ్యక్షుడు కుంటిమారి నర్సింహులు తెలిపారు. ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో నూతన ఆలయ కమిటీ ఎన్నుకున్నామన్నారు. నూతన అధ్యక్షులుగా మహేందర్ గారు, ఉపాధ్యక్షులు గొల్ల చలపతి, బత్తుల నర్సింహ, జూలు వెంకటేష్, ఈరముష్టి భీమేష్, సత్యనారాయణ, కోశాధికారిగా సిద్ధన్ లక్ష్మణ్, కార్యదర్శిగా అవుటి వీరేష్, ప్రచార కార్యదర్శి అవుటీ రాజశేఖర్, సలహాదారులుగా మదన్, చెన్నారెడ్డి, దాసరి రాములు, శ్రీమన్నారాయణ, ఎల్లప్ప, వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నూతన అధ్యక్షుడు మహేందర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

నర్వ: విద్యార్థులు వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నవీన్‌షా అన్నారు. సోమవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, క్రాఫ్ట్‌వర్క్, డ్యాన్స్, యోగా, మొదలైన అంశాలను బోధిస్తామన్నారు. ఈ అంశాలను బోధించడానికి ప్రతిభ కలిగిన వలంటీర్ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, మహేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మెడిటేషన్ చేస్తున్న జీహెచ్ఎం గురురాజారావు

యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరం

మాగనూర్: మండలంలోని వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు పాఠశాల జీహెచ్ఎం గురురాజారావు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు క్రీడలు, పాటలు, కరాటే, మెడిటేషన్‌తో పాటు గణితం, ఆంగ్లం నందు లేఖన నైపుణ్యాన్ని మెరుగు పరుచుటకు ఈ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి సువర్ణ అవకాశామన్నారు. శిక్షణ శిబిరంలో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' కలయిక

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సన్మానించారు.కార్యక్రమంలో సాగర్, చిన్నారెడ్డి, రాములు, శ్రీనివాస్, మొగులప్ప, వెంకట్ రెడ్డి, అశోక్, లక్ష్మణ్, నరసింహులు, శారద, అనసూయ, శ్రీదేవి, గీత పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాల వేళ..

వారు ఒకరినొకరు వీడి 25 ఏళ్లు గడిచింది. స్వర్ణోత్సవాలకు తిరిగి ఒకే వేదికపై కలుసుకున్నారు. పట్టణంలోని దయానంద్ విద్యా మందిర్‌లో 1999–2000 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. విద్యార్థుల మిలినియం బ్యాచ్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామ్ చరణ్, సి నారాయణ రెడ్డి, కే నారాయణ, సూర్యనారాయణ, జి నారాయణ, ప్రభాకర్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



కోటకొండలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు'

నారాయణపేట: రైతుల సాగు సమస్యలు పరిష్కరించి అధిక దిగుబడి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సమిష్టిగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని రూపొందించిందని పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ పరిమళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయ పాలిటెక్నిక్ నారాయణపేట శాస్త్రవేత్తలు ఈ నెల 5నుంచి జూన్ 15 వరకు జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మద్దూర్, గుండుమాల్, జాజాపూర్, పాతపల్లి, బైరంకొండ, కంసాన్‌పల్లి గ్రామాలను ఎంపిక చేశారని, ఈ వానాకాలంలో రైతులు వేయవలిసిన పంటలు, ఎంచుకోవలిసిన విత్తనాలు, యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయనాలు వాడకం తగ్గించడం, సాగునీటి సద్వినియోగం, పంట మార్పిడి, పురుగు, ఎరువులు, రసాయనాలు భద్రపరచడం, నేల, పర్యావరణ పరిరక్షణ వంటి పద్ధతులు, మెలకువలను రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీ



కోస్గి రూరల్: మున్సిపల్ కేంద్రంలో నార్కొటిక్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు జిల్లా ఎస్పి యోగేశ్ గౌతమ్ తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరగకుండా కోస్గి పట్టణంలో పకడ్బందీగా తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా కిరాణా షాపులు, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో, పాన్‌షాపులో తనిఖీ నిర్వహించారు. ప్రజలు ఎవరైనా గంజాయి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా 100 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో కోస్గి పోలీసులు విజయ్ కుమార్, నార్కొటిక్ స్నైపర్ డాగ్ విక్కీ, డాగ్ హ్యాండ్లర్ పరమేశ్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో చెరువుకట్ట సమీపంలోని ఓ దేవాలయం దగ్గర సోమవారం పేకాట ఆడుతుండగా పలువురిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ కృష్ణం రాజు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, నగదు తో పాటు సెల్‌ఫోన్లు లభించాయని, 5గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మే 20న జాతీయ సమ్మె

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులు, సీనియర్ మేటీలు పాల్గొంటున్నట్లు నారాయణపేట మండల ఎంపీడీఓ సుదర్శన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకుల సంఘం రాష్ట్ర నాయకులు కాశీనాథ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, దేశ సంపదను బడా బాబులకు అప్పజెప్పే నేషనల్ మోనిటైజేషన్ పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయికులకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు సేవలు చేస్తూ దేశంలో మత విద్వేషాలను పెంచి పోషిస్తోందని విమర్శించారు. దేశవ్యాప్త సమ్మెను నారాయణ పేట జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, రఘుపతి, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

క్యాన్సర్ కణితి తొలగింపు

నారాయణపేట రూరల్: దామరగిద్దకు చెందిన శాంతమ్మ గత కొన్ని నెలలుగా కడుపులో ఉన్న 4కిలోల క్యాన్సర్ కణితితో బాధపడుతూ ఉంది. ఈ క్రమంలో పట్టణంలోని గీత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులను సంప్రదించగా మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రఖ్యాత క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు రాజుకుమార్, శస్త్ర చికిత్స నిపుణుల సహాయంతో డాక్టర్ విశ్వనాథ్, స్త్రీ వైద్య నిపుణురాలు గీత ఆధ్వర్యంలో అరుదైన శస్త్ర చికిత్సతో ఆ మహిళా గర్భంలో గల 4కిలోల క్యాన్సర్ కణితిని తొలగించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులతో పాటు ఉసేనమ్మ కుటుంబీకులు, బంధువులు పలువురు ఆపరేషన్ చేసి కణితిని విజయ వంతంగా తొలగించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంపౌండ్ గేట్‌ను ఢీకొన్న లారీ

నర్వ: మండలంలోని ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాల గేట్‌ను సోమవారం లారీ ఢీకొట్టడంతో కాంపౌండ్ గేట్, గోడ పగిలిపోయినట్లు హెచ్ఎం వెంకటన్న తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. రహదారి పక్కనే పాఠశాల ఉండడంతో పెద్ద లారీ ప్రహరీని ఢీకొట్టిందన్నారు. గత వేసవి సెలవుల్లో చెట్టుకూలి ప్రహరీ కూలగా, ఈ వేసవి సెలవుల్లో లారీ ఢీకొట్టి గేట్, గోడ కూలాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



కొత్తపల్లి: కొడంగల్ నియోజకవర్గం కొత్తపల్లి మండల పరిధిలోని వాల్యానాయక్ తండా, బోజ్యానాయక్ తండాలో కొడంగల్ కాడా ప్రత్యేక నిధులతో హైమాస్ట్ వీధి దీపాలు సోమవారం మాజీ సర్పంచ్ శ్రీను నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అడవి ప్రాంతాల్లో నివసించే తండాలకు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం వల్ల తండాల్లో వెలుగు రావడంతో తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హన్మంతు నాయక్, పూణ్యా నాయక్, దాన్యా నాయక్, వెంకటేశ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వస్తా.. పోతా ఒకే బస్సు



ఆత్మకూర్ బస్సు ఎక్కేందుకు గుమికూడిన ప్రయాణికులు

మరికల్: ఆత్మకూర్ మరికల్ మధ్యన వస్తా పోతా ఒకే ఒక బస్సు నడిపించడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి బస్సుకోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వనపర్తి డిపో నుంచి వారం రోజు క్రితం వరకు ఆర్టీసీ అధికారులు రెండు బస్సులు నడిపించారు. ప్రస్తుతం ఒకే బస్సు నడిపిస్తున్నారు. ఒకసారి ఆత్మకూర్ నుంచి మరికల్‌కు బస్సు రావాలంటే మూడు గంటల సమయం పడుతుంది. రోజుకు 3 నుంచి 4 ట్రిప్పుల చొప్పున రెండు పట్టణాల మధ్యన ఒకే బస్సులో ప్రయాణికులను తరలిస్తున్నారు. దీంతో ఆత్మకూర్ నుంచి మరికల్‌కు రావాలంటే బస్సు వచ్చే వరకు రెండు బస్టాండ్లలో 3 గంటల పాటు ప్రయాణికులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యథావిధిగా ఆర్టీసీ అధికారులు రెండు బస్సులు నడిపించి ప్రజల కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: 'పడకేసిన పారిశుద్ధ్యం' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన సాక్షి కథనానికి అధికారు లు స్పందించారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపైనే పారుతున్న మురుగు, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేయగా సాక్షిలో ప్రచురితమైంది. మండలంలోని ఎక్కామేడ్ గ్రామ పంచాయతీలో హనుమాన్ దేవాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్డుమీద పారుతున్న మురుగు వల్ల నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులుండడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి సిబ్బందితో శుభ్రం చేయించారు. మురుగు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చేశారు. దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీఓ రామన్న తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినలేదని, సాక్షి కథనంతో స్పందించి సమస్యను పరిష్కరించడంతో 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎక్కామేడ్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు